క్లుప్తంగా

వీఆర్వోల బదిలీ

నిమ్మనపల్లె : మండల రెవెన్యూ పరిధిలో పలువురు వీఆర్వోలను బదిలీచేస్తూ జిల్లా కలెక్టర్ గిరీషా.పీఎస్. ఉత్తర్వులను జారీ చేశారు. మండలం నుంచి బదిలీ అయిన వీఆర్వోలలో నిమ్మనపల్లె-2 బి.రజనీకాంత్ ములకలచెరువు మండలం బడికాయలపల్లెకు, జి.రాజగోపాల్ బండ్లపై నుంచి ముదివేడుకు, ఎం.శ్రీనివాసులు రాచవేటివారిపల్లె నుంచి కలికిరికి బదిలీ కాగా, నిమ్మనపల్లె మండలానికి వచ్చిన వీఆర్వోలలో బి.రామకృష్ణ కలకడ మండలం నడిమిచెర్ల నుంచి రాచవేటివారిపల్లెకు బదిలీ అయ్యారు. వి.రూప్‌కుమార్ ఎర్రకోటపల్లె నుంచి నిమ్మనపల్లె-1కు, డి.వేణుగోపాల్‌రెడ్డి ముదివేడు నుంచి బండ్లపైకి, ఎం.మంజునాథ్ పంచాలమర్రి నుంచి తవళంకు, కే.చంద్రశేఖర్ బురకాయలకోట నుంచి నిమ్మనపల్లె-2కు బదిలీ అయ్యారు.

ఘనంగా గంగమ్మ జాతర

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట వద్ద వెలసిన అమ్మచెరువుమిట్ట గంగమ్మ జాతర బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. జాతర పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించారు.

కేశాలు దానం

మదనపల్లె సిటీ: కేన్సర్ బాధితుల మోహాల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టినట హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం మదనపల్లె రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌కుమార్,రాధిక దంపతుల కుమార్తె హేమశ్రీ హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తన కేశాలను దానం చేశారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని కార్మికశాఖ అధికారి ఆనందబాబు అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలోని వివిధ దుకాణాలకు వద్దకు వెళ్లి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. చదువుకునే వయస్సులో పిల్లలు బడిలో మాత్రమే ఉండాలన్నారు. పిల్లల ప్రతిభ చదువులో కనపడాలే తప్ప పనిలో కాదన్నారు. ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, సీఆర్పీ మురళీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సహకారం మరువలేనిది

కలకడ : ఆలయ నిర్మాణంలో భక్తుల సహకారం మరువలేనిదని మండలంలోని ఎర్రకోటపల్లె శ్రీకోటమిట్ట ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బానుప్రసాద్, మోహన్‌నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని పాపిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీరాములు ఆలయ గర్భగుడి నిర్మాణం కోసం రూ.10,107 చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో నీటి ట్యాంక్, భక్తుల సౌకర్యార్థం మంచినీరు, భజన స్థలం వంటివి భక్తుల సహాయ సహకారాలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. .

ఘనంగా ఆంజనేయస్వామి తిరునాల

కేవీపల్లె : మండలంలోని వగళ్ల పంచాయతీ నారమాకులమిట్ట వద్ద వెలసిన శ్రీ ఆంజనేయస్వామి తిరునాల ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం గణపతి పూజ, గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహహోమం, వాస్తు హోమం, అభిషేకం, అలంకరణ నిర్వహించారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కోలాటాలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవి తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో చాందినీ బండ్లు కట్టారు. కార్యక్రమంలో కృష్ణమ్మ, గోపాల్‌రెడ్డి, కుప్పం రవిచంద్రారెడ్డి, యర్రమరెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనల్లో మార్పుతో ఆత్మహత్యల నివారణ

కురబలకోట: ఆలోచనల్లో మార్పుతో ఆత్మహత్యలను నివారించవచ్చని మోటివేషనల్ స్పీకర్ వి. సుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం యాంటీ సుసైడ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవితం జీవించేందుకేనని గుర్తించాలన్నారు ప్రతి సమస్యకు పరిష్కారం ఉందన్న విషయం తెలీక నిరాశ, నిస్పృహ, ఆందోళన లాంటి చిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. క్షణికావేశంలో అర్ధాంతరంగా నిండు జీవితాన్ని ముగిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుంగుబాటు, వత్తిడి, అనారోగ్యం,పరీక్షల్లో తప్పిపోవడం, అవమానం, అనుమానం, సమస్యలు, ఒంటరితనం, ప్రేమ విఫలం తదితర మానసిక ఆందోళనలతోనే ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వివిధ పరిశోధనల్లో వెల్లడైందన్నారు.

వలంటీర్లే సంక్షేమ వారధులు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



వలంటీర్ల సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు: గ్రామ సచివాలయాల పరిధిలో పని చేసే గ్రామ వలంటీర్లే సంక్షేమ వారధులని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో పీటీఎం, తంబళ్ళపల్లి, బి.కొత్తకోట, కురబలకోట, ములకలచెరువు మండలాల వలంటీర్లతో ఆయన సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులకు అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ పాలనలో లబ్ది పొందిన విధానంపై వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్ళి వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకునే బాధ్యత కూడా మీదే అన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల అవసరాలను గుర్తించి ఏడు వేల ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసామన్నారు. అంతేగాక అదనపు సబ్ స్టేషన్లతో పాటు పీటీఎం సమీపంలో 250 కేవీ సామర్థ్యం గల విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. పురాతన ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.1.47 కోట్ల నిధులతో పాత ములకలచెరువులోని ఆలయంతో పాటు పీటీఎం మండలంలోని కాట్నగల్లు, తుమ్మరకుంట ఆలయాల రూపురేఖలను మార్చే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఆరు మండలాల్లోని 5 సేవా వజ్ర ,26 సేవా రత్న పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను సన్మానించారు. నియోజకవర్గంలోని వలంటీర్లకు ఎమ్మెల్యే సొంత నిధులతో సమకూర్చిన దుస్తులను అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా కురబలకోట మండలంలో పని చేస్తున్న ప్రతి వలంటీర్‌కు రూ.500ల నగదు అందజేస్తానని వైఎస్సార్‌సీపీ నాయకుడు బైసాని చంద్రశేఖర్ సభాముఖంగా తెలియజేసారు.

ఐదుగురికి సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని ఐదుగురికి మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.6.54 లక్షల చెక్కులను ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. అనంతరం చుక్కల భూముల రైతులకు పాసు పుస్తకాలు అందజేసారు. మావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు సాయిలీల, మహమూద్, అనసూయమ్మ, దస్తగిరి, బైసానీ జ్యోతి, శివన్న, సర్పంచ్‌లు రహ్మత్‌బీ, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంబాబు, జయచంద్ర, సింగిల్ విండో చైర్మన్ గౌరీశంకర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు రేష్మా, ఆయూషా, క్రిష్టప్ప, వెంకట్రామిరెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, చాంద్‌బాషా, రఫీ, సురేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాలు చంద్రబాబుకే చెల్లు

చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే జిల్లాలో ఎక్కడైనా నాపై పోటీకి సిద్ధమా అంటూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం ఆయన స్థానిక మార్కెట్ యార్డ్‌లో వలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో ప్రసంగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎన్టీఆర్ ఫోటోను అడ్డం పెట్టుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేసారు. వార్డు మెంబర్‌గా కూడా పోటీ చేసి గెలవని లోకేష్ పెద్దిరెడ్డి కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. తంబళ్ళపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్రలో టీడీపీ నాయకులంతా కళ్ళారా చూసారన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లూరు గ్రామం గుండ్లూరు కస్బాలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి గత నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వం నుంచి ప్రతి ఇంటికి అందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీస్తూ.. ఇంకా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి రూ.లక్ష నుంచి రూ.5లక్షలకు పైగా లబ్ధిచేకూరి ఉండటంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు, సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, సామాజిక పింఛన్లు, అభయహస్తం పింఛన్లు, భూములు ఆన్‌లైన్ సమస్య తదితర సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని నమోదు చేయాలని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుకు అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంద న్నారు.

చుక్కల భూముల సమస్య పరిష్కారం:

ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న చుక్కల భూములకు ప్రభుత్వం విముక్తి కల్పించిందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. దశాబ్దాల తరబడి చుక్కల భూములతో రైతులు ఇబ్బందులు పడుతుండటం గమనించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారన్నారు. చుక్కల భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో రైతులు విక్రయించుకోలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సీఎం నిర్ణయంతో నిషేధిత జాబితా నుంచి చుక్కల భూములు తొలగించడంతో రైతులకు పూర్తి హక్కు కల్పించడం జరిగిందన్నారు. రైతులు క్రయ విక్రయాలు చేసుకునేందుకు వెసులుబాటు కలిగిందని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరుతో రాసిన ప్రత్యేక లేఖలను చుక్కల భూముల లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆహామొహిద్దీన్, మండల పార్టీ కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, తస్లీమారిజయ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, స్థానిక నాయకులు రౌనక్‌బాషా, షాజీతుల్లా, జుబేర్ అహ్మద్, రామచంద్రారెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడమే లక్ష్యం

– మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి



రాకేష్‌రెడ్డి పరిచయ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడలమే లక్ష్యంగా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. మంగళవారం శ్రీనాథరెడ్డి తనయుడు, యువ పారిశ్రామికవేత్త రాకేష్‌రెడ్డి ప్రజలతో పరిచయ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి రాకేష్‌రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. పేదల పక్షపాతిగా మన్ననలు పొందుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, షఫీ, ఉదయ్‌కుమార్, ఆనంద్, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, నాగభూషణం, తిరుమలరెడ్డి, షాకీర్, ఉమాకాంత్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, రవి, మహేష్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణపై అవగాహన

– మెడికల్ ఆఫీసర్ డాక్టర్.జులేఖాబేగం



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖాబేగం

నిమ్మనపల్లె : అతిసార నియంత్రణపై ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖాబేగం అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. అతిసార నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. జూన్ 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో(ఐడీసీఎఫ్)లో భాగంగా ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పి.లు ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అతిసారపై అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్ఎంలు తమ పరిధిలో ఐదు ఏళ్లలోపు వయస్సు కలిగిన పిల్లల ఇంటిలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని తప్పనిసరిగా ఉంచాలన్నారు. టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు కలిగిన వ్యక్తులు వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యం పొందాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది మల్లిక, రామచంద్ర, ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పి.లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కలికిరి: వేసవితీవ్రత దృష్ట్యా వైద్య సిబ్బంది అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆరోగ్య ఉపకేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలని సూచించారు. డయేరియా వచ్చిన పిల్లలకు తప్పనిసరిగా 14 రోజులు జింక్ అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పీలేరు : అతిసారపై అప్రమత్తంగా ఉండాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. మంగళవారం తలపుల పీహెచ్‌సీలో అతిసారపై అవగాహన గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు మండుతుండడంతో ప్రజలు ఎక్కువగా ఎండలో తిరగరాదని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అతిసారకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నీరు ఎక్కువగా తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ కొండయ్య, ఆరోగ్య వెంకటసుబ్బమ్మ, కృష్ణయ్య, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సామాజిక తనిఖీ

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలోని వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య, గ్రామస మాఖ్యలకు సంబంధించి సోషియల్ ఆడిట్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం డీజీఎం మధు ఆధ్వర్యంలో ఆడిట్ కార్యాక్రమం చేపట్టారు. మండలంలోని 28 గ్రామ సమాఖ్యలు, మండల సమాఖ్యకు సంబందించి పూర్తి లావాదేవిలపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. గతంలో మండలంలోని రామాపురం, శెట్టివారిపల్లె, ఎల్లుట్ల, నడిమికండ్రిగ గ్రామ సమాఖ్యలకు సంబంధించి పలు ఆరోపణలు వచ్చాయి. వాటిపై కుడా పూర్తి స్థాయిలో విచారణ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

గురుప్రసాద్‌కు మదర్‌థెరిసా మెమోరియల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాటకొండ గురుప్రసాద్

మదనపల్లె : పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్.అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా మదర్‌థెరిసా మెమోరియల్ నేషనల్ అవార్డు అందుకున్నారు. బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో మంగళవారం ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సామాజికన్యాయం, విద్యాసేవలో విశేష సేవలందిస్తున్న పలువురికి అవార్డులను అందజేశారు. ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న డాక్టర్ రాటకొండ గురుప్రసాద్‌కు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

దోమల నివారణపై అవగాహన పెంచండి



మాట్లాడుతున్న డాక్టర్ జవహర్‌బాబు

కలకడ : మండలంలోని ప్రతి ఇంట దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను తెలియజేయాలని డాక్టర్ జవహర్‌బాబు ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీలో ఆశాడే సరదర్భంగా ఆశావర్కర్లలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. నెలరోజుల పాటు 30వ తేది వరకూ పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాలలో మలేరియ మాసోత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి దోమతెరల వినియోగం, మస్కిటో కాయిల్స్, వ్యర్థపదార్థల నివారణ, పరిశుభ్రతపై అవగాహన పెంచాలన్నారు. విషజ్వరాలు ప్రబలే గ్రామాలను ముందుగా గుర్తించి ఏఎన్‌యంలు, ఆశావర్కర్లు, ఆరోగ్యసిబ్బంది ప్రత్యేక క్యాంప్, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అవరమైన ప్రతి గ్రామానికి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్ ముజీబ్‌బాష, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

విత్తన కాయలను సద్వినియోగం చేసుకోండి



మేడికుర్తిలో వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న రత్నశేఖర్ రెడ్డి, ఏఓ తదితరులు

కలికిరి: ప్రభుత్వం రాయితీ ధరతో అందజేస్తున్న వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ నాగవేణి అన్నారు. మండలంలోని మేడికుర్తి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు విత్తనకాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాంలో రైతులకు విత్తన కాయలు సరఫరా చేయడం జరుగుతోందని, అసరమైన ప్రతి రైతుకు కాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, ఏఓ మమతారెడ్డి పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దమండ్యం: ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని కలిచెర్ల పశువుల ఆసుపత్రిలో మంగళవారం రైతులకు మొక్కజొన్న, జొన్న, అలసంద విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొవాలని ఆమె కోరారు. 50 శాతం రాయితీపై రైతులకు విత్తనాలను ఇస్తున్నట్లు డాక్టర్లు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్‌లు తెలిపారు. మండలంలోని కలిచెర్ల, వెలిగల్లు, పెద్దమండ్యం పశువుల ఆసుపత్రుల్లో రైతులకు జొన్న, మొక్కజొన్న, అలసంద విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విశ్వనాథ, బాషా, ఎంపీటీసీ జయరాం పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ: వేసివి విజ్ఞాన శిబిరాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి రెడ్డి కుమారి అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలకు పేపర్ క్రాఫ్ట్,డ్రాయింగ్ డాన్స్, కథలు చెప్పడం , యోగా పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవి శెలవుల్లో పిల్లల కొసం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు.

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మదనపల్లె : ఆశా కార్యకర్తలకు ఉద్యోగభద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఇన్‌చార్జ్ యం.గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆశాడే సందర్భంగా పలు యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలలోని ఆశా కార్యకర్తలతో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి దేవ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీసవేతనం రూ.26వేలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు ఐక్యంగా సంఘటితమై హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి, కల్పన, జి.కుమారి, ఏ.కుమారి, కమల, విమలాంజన, కృష్ణవేణి, లక్ష్మీభవాని, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వాల్మీకిపురం: స్థానిక శ్రీ షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

మాటిచ్చారు .. తారురోడ్డు వేశారు

- గతంలో ఓటుబ్యాంకు రాజకీయాలు చేసిన నేతలు
- జనుపవారిపల్లెకు రూ.1.37 కోట్లతో తారురోడ్డు
- ఒక మహిళ అభ్యర్థనతో రోడ్డు వేయించిన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



జనుపవారిపల్లెకు పూర్తయిన తారురోడ్డు

బి.కొత్తకోట: జనుపవారిపల్లె..ఈ పల్లె బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ఉంది. ఓ సామాజిక వర్గం అధికంగా ఉన్న ఈ పల్లెను రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగానే చూశారు. బి.కొత్తకోట-పెద్దతిప్పసముద్రం రోడ్డు నుంచి కాలినడకన జనుపవారిపల్లెకు వెళ్లాల్సి ఉంటుంది. పొలాల మధ్యలో బైక్‌లపై ప్రయాణం..వర్షం వస్తే రాత్లతేలి ఇబ్బందులు తలెత్తేవి. 2022లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి జనుపవారిపల్లెలో ప్రజా సమస్యలపై ఇంటింటికి వెళ్లారు. అందరూ తమ సమస్యలు చెప్పుకొన్నారు. అన్ని సమస్యలు ఆలకించిన ఆయన పరిష్కారం కోసం అధికారులను, ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. ఓ ఇంటివద్దకు వెళ్లగానే ఓ మహిళ ఇంటిలోకి ఆహ్వానించింది. అయ్యా మా పల్లెకు రోడ్డులేదు..వేయించండి అని ప్రాధేయపడింది. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే నియోజకవర్గమంతా రోడ్లు వేయిస్తున్నాం, జనుపవారిపల్లెకు రోడ్డు వేయిస్తా..బాధపడొద్దు అంటూ సముదాయించారు. వేరే పార్టీల నాయకులైతే ఈ పల్లెకు రోడ్డు వేయించే విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాల గురించి, రాజకీయ ప్రయోజనాల గురించి ఆలోచించి ఉండేవారేమో..కాని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కన పెట్టారు. ప్రజల బాధలు, సమస్యలు తీర్చాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఆయన ఇవేమి పట్టించుకోకుండా రోడ్డు పనులు పూర్తి చేయించారు. మొత్తం రూ.1.37 కోట్లతో 2.45 కిలోమీటర్లు తారురోడ్డు వేయగా, 0.25 కిలోమీటర్ సిమెంట్‌రోడ్డును నిర్మించారు. 2.700 కిలోమీటర్ల రోడ్డు రూపుదిద్దుకొంది. తారురోడ్డు పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నికైన ఎమ్మెల్యేలు, సుదీర్ఘకాలం ఎంపీగా పనిచేసిన ఓ నేత రోడ్డు వేయిస్తామని ప్రతి ఎన్నికలో హామీ ఇచ్చినా నెరవేర్చింది లేదు. ఎన్నికలయ్యాక ఈ గ్రామం గురించి కనీసం పట్టించుకోలేదు.

అభివృద్ధిని చేతల్లో చూపుతున్నాం

తంబళ్లపల్లె ప్రజల ఆదరణ జీవితంలో మరచిపోలేను. నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ ప్రాజెక్ట్స్ విభాగం ద్వారా రూ.396 కోట్లతో 712.545 కిలోమీటర్ల తారురోడ్లు వేయించాం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల సహకారంతో 75 ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో మాటల్లో కాకుండా చేతల్లో చూపించాం. ఈ అభివృద్ధిలో ఎక్కడా రాజకీయాలను పట్టించుకోలేదు. దీన్ని ఎన్నికల్లో ప్రచారంగా భావించలేదు. అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలే గుర్తిస్తారు.

-పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

పెద్దమండ్యం: ప్రభుత్వం రాయితీపై రైతులకు బిందు సేద్యం పరికరాలను అందిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి తేజశ్విని మంగళవారం తెలిపారు. సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా అర్హత ఉన్న రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను విరివిగా ఇస్తున్నట్లు చెప్పారు. బిందు సేద్యం పరికరాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకాల నకలుతో సమీపంలోని రైతుభరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐదు ఎకరాలలోపు భూమి విస్తీర్ణం కలిగిన రైతులకు 90 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి: మండలంలోని గుండ్లూరు గ్రామంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. గుండ్లూరు కస్బా, హరిజనవాడ, కాలని, నాయకునివారిపల్లి ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించి ప్రజా సమస్యలపై విచారిస్తారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.